76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL14598 స్థాపితం : 2015

# రాజధాని వార్తలు

Voice of Voiceless


అమరావతి 10-4-2019 బుధవారం సంపుటి : 1 సంచిక 88 | రాజధాని వార్తలు తెలుగు దిన పత్రిక | పేజీలు 4, వెల: రూ. 2.00

వివరాలు2లో...



మంత్రులకు గుండెదడ..!

వివరాలు2లో...



'వంద మంది మోదీలొచ్చినా నన్నేం చేయలేరు'

వివరాలు3లో...



ఊరు పిలుస్తోంది

వివరాలు4లో...



వైఎస్సార్‌సీపీ కి జమాయత్ ఉలేమా కౌన్సిల్ మద్దతు

# జగనే సి.ఎం

**రాజధాని వార్తలు,అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు అధికార పార్టీ, ప్రతిపక్షా పార్టీలు సవాలుగా తీసుకుని ఎన్నికల ప్రచార పర్వం ముగించాయి. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతి ప్రాంతం రాయపూడి నుంచి ప్రచురితమవుతున్న 'రాజధాని వార్తలు' వార పత్రిక ప్రధాన రాజకీయ పార్టీ ల గెలుపు ఓటములపై ఒక విలక్షణమైన సర్వే 13 జిల్లాలో చేసింది. ఈసర్వే లో 96 శాసనసభ స్తానాలు,లోక్‌సభలో 15 స్తానాలు వైస్సార్సీపీ కి కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని తేలింది. దీనికి ప్రాధాన కారణంగా అనేక ప్రభుత్వం ప్రకటించిన పథకాలు సరిగ్గా అమలు కాకపోవటం, భూమి, ఇసుక, జన్మభూమి కమిటీల అవినీతి, ఇంకా అమలు కాని ఎన్నో పథకాలు కారణమని ప్రజలు వాపోతున్నారు

## మెజారిటీ సర్వే సంస్థల అంచనా

**మే 26 న గుంటూరు లేదా ఒంగోలులో కొత్త మంత్రివర్గ విస్తరణ స్వీకారం ?**

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై పలు సర్వే సంస్థలు నిర్వహించిన సర్వేలలో ఏప్రిల్ 11న జరగనున్న శాసనసభ ఎన్నికలలో వైస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైస్సార్ సీపీ ఘన విజయం సాధించనున్నట్లు అంచనా వేసాయి. వైస్సార్సీపీ కి 100 నుండి 130 స్థానాల వరకు లభించవచ్చని తెలుగుదేశం కు 30 నుంచి 50 వరకు లభించవచ్చని ఈ సంస్థల అంచనా. పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేనకు 1 నుంచి 3 స్థానాలు లభించే అవకాశం ఉందని సర్వే సంస్థల అంచనా. వైస్సార్సీపీ కి లోక్‌సభలో 16 నుంచి 21 స్థానాలు లభించగలవని టీడీపీ కి 4 నుంచి 7 స్థానాలు లభించగవని సర్వే సంస్థలు పేర్కొన్నాయి. కాగా వైస్సార్సీపీ కి 22 లోక్‌సభ స్థానాలు 130 కి పైగా శాసనసభ స్థానాలు దక్కుతాయని తెలంగాణా ముఖ్యమంత్రి కే.చంద్ర శేఖర్‌రావు, ఎంఐఎం నాయకుడు ఓవైసీ ప్రకటించారు. ఈ అంచనాలు వైకాపా నేతలలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా ఇచ్చే పార్టీకి మాత్రమే కేంద్రంలో తన పార్టీ మద్దతు ఉంటుందని జగన్మోహన్ రెడ్డి స్పష్టం గా ప్రకటించారు. మే 26 న ముహూర్తాల ప్రకారం కొత్తమంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని వైస్సార్సీపీ వర్గాల ద్వారా తెలుస్తున్నది. కొత్త మంత్రివర్గ ప్రమాణ స్వీకారం గుంటూరులో గాని, ఒంగోలులో గాని జరిగే అవకాశం ఉందని వైస్సార్సీపీ వర్గాల భోగట్టా. కొత్త మంత్రివర్గంలో స్థానం లభించబోయే మంత్రులపై కూడా ఊహాగానాలు ప్రారంభమైనాయి. మంగళగిరి అభ్యర్థి అల్లా రామకృష్ణా రెడ్డి, యస్వి.మోహన్ రెడ్ల పేర్లు జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.





## పేదలకు అండగా పథకాలు, నవరత్నాలు.. వైసీపీ మేనిఫెస్టో

ఉగాది పర్వదినాన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో.. జగన్ చేతుల మీదుగా శనివారం (06-04-2019) ఉదయం 10 గంటలకు మేనిఫెస్టో విడుదలయ్యింది.

మేనిఫెస్టోతో రాష్ట్రంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టామన్నారు జగన్. ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘ పాదయాత్ర చేసి.. పేదలకు అండగా.. నవరత్నాలను కలిపి ఈ మేనిఫెస్టోను రూపొందించామన్నారు.

ప్రతి రోజూ మేనిఫెస్టోపై సమీక్ష చేస్తూ... కచ్చితంగా అమలు చేసి 2024లో మళ్లీ ఓట్లు అడుగుతామన్నారు. పాదయాత్రతో పాటూ ప్రచారంలో ప్రస్తావించిన 'నవరత్నాల'కు మేనిఫెస్టోలో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మనసా వాచా కర్మనా హామీలను అమలు చేస్తామన్నారు.

## మేనిఫెస్టో హైలైట్స్

* పేదలకు అండగా పథకాలు
* నవరత్నాలను మేనిఫెస్టోలో చేర్చిన వైఎస్సార్‌సీపీ
* మేనిఫెస్టోతో రాష్ట్రాభివృద్ధికి ఓ సమగ్రమైన ప్రణాళిక

## మేనిఫెస్టో ముఖ్యాంశాలు

* రైతులకు ఉచితంగా బోర్లు.. కౌలు రైతులకు వడ్డీలేని రుణాలు
* రైతులకు పగడిపూట 9గంటల ఉచిత విద్యుత్
* రైతుల కోసం రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
* ఆక్వా రైతులకు యూనిట్ రూపాయికే విద్యుత్
* రైతులకు రూ.12,500 చొప్పున నాలుగు దఫాలుగా రూ.50వేలు
* రైతు కుటుంబాలకు రూ.7లక్షలతో బీమా
* రైతులకు సున్నా వడ్డీకే రుణాలు
* వైద్యం ఖర్చు రూ. వెయ్యి దాటితే చాలు ఆరోగ్య శ్రీ పరిధిలోకి
* అన్ని రకాల వ్యాధులు ఆరోగ్య శ్రీ పరిధిలోకి
* ప్రభుత్వ ఆస్పత్రుల దశా దిశా మార్చడం
* కిడ్నీ సహా ధీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10వేలు పింఛన్
* వృద్ధాప్య పింఛన్ రూ.3వేలకు పెంపు
* పింఛన్ అర్హత వయసు 65 నుంచి 60కు తగ్గింపు
* అగ్రిగోల్డ్ బాధితులకు రూ.1150 కోట్లు కేటాయింపు
* మూడు దశల్లో మద్యపాన నిషేధం
* ఖాళీగా ఉన్న లక్షా 30వేల ఉద్యోగాలు భర్తీ
* ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లు నిర్మిస్తాం
* శ్రీవారి సన్నిధిలో తలుపులు తీసే అవకాశం గొల్లలకు కల్పించడం

# దారి లేని 33 వేల ఎకరాల రాజధాని అమరావతి

**రాజధాని వార్తలు, అమరావతి :** రాజధాని ప్రాంతం అభివృద్ధి చేయటానికి రైతుల నుంచి రికార్డు స్థాయిలో 33 వేల ఎకరాల సారవంతమైన భూములను సేకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐదు సంవత్సరాలలో కొత్త రాజధానికి వెళ్లే రహదారులన్నీ నిర్మించలేకపోగా రైతులకు ఇచ్చిన హామీలు కుడా నెరవేర్చలేదని స్థానిక రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూములు ఇచ్చిన మూడు ఏళ్లలోగా అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతులకు ఇస్తామని చెప్పిన వాగ్దానం సరైన సమయానికి ఆచరణకు నోచుకోలేదు. రైతులకు ఇచ్చిన వాగ్దానం పట్టించుకోకుండా రాజధాని ప్రాంతంలోని విలువైన స్థలాలను నామమాత్రపు ధరలకు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టారని స్థానిక రైతులు విమర్శిస్తున్నారు. తాత్కాలిక సచివాలయం వెలగపూడికి వెళ్లేందుకు సరైన రహదారులే లేకపోవటం సూఛనీయమని రైతులు అంటున్నారు. సరైన రహదారులు లేక సచివాలయానికీ వెళ్ళటానికి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుంది. అరకొరగా ఉన్న రహదారులు భారీస్థాయిలో ఇసుక రవాణా లారీలతో ధ్వంసమయ్యాయి. ఈ రహదారుల మరమ్మత్తులమీద కుడా ప్రభుత్వం తగు శ్రద్ధ వహించలేదు. రైతుల ప్లాట్లు ఎప్పుడు అభివృద్ధి చేస్తారో ప్రభుత్వం నుంచి సరైన సమాచారం లేదు. విజయవాడ నుంచి రాజధాని ప్రాంతానికి ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీడ్ యాక్సిస్ రోడ్డు కూడా అర్ధాంతరంగానే ఉంది, రాజధాని ప్రాంతంలో అనేక చెరువులను సుందరీకరించకుండా క్రాస్ రోడ్ల కొరకకు పూడ్చారు. అయితే అవికూడా పూర్తి కాలేదు. ప్రతిష్టాత్మకంగా వచ్చిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కి, విట్ యూనివర్సిటీ కి కుడా సరైన రహదారి లేకపోవటం తో విద్యార్థులు, రాజధాని కి వచ్చేవారికి అంతో ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటివరకు చేసిన తాత్కాలిక నిర్మాణాలతో అమరావతి ప్రాంతం కాంక్రీట్ జంగిల్ గా మారటంతో పాటు, కాలుష్యకోరలలో చిక్కుకుని ఉందని స్థానికులు తెలుపుతున్నారు.

## ఆగిన మైకులు.. ముగిసిన ప్రచార భేరి!




**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో వేసవి ఎండలను మించి వాడీవేడిగా సాగిన ఎన్నికల ప్రచార హెూరుకు తెరపడింది. 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికల ప్రచార గడువు మంగళవారం సాయంత్రం 6 గంటలతో ముగిసింది. ఇప్పటివరకు హెూరెత్తిన మైకులు మూగబోయాయి. ప్రచార కోలాహలం సద్దుమణిగడంతో.. ఇక, పార్టీలన్నీ 11వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియపై దృష్టి సారించాయి. అందుకు తగిన ఏర్పాట్లలో తలమునకలయ్యాయి.

# రామకృష్ణారెడ్డి కి కేబినెట్ లో స్థానం.......

## మంగళగిరి సభలో వెల్లడించిన జగన్. ... లోకేష్ ను ఓడించినందుకు కానుక ??

**రాజధాని వార్తలు, మంగళగిరి :** సౌమ్యుడు,అవినీతి ఆరోపణలు లేని ఆర్.కె.ని మంగళగిరి నియోజకవర్గ ప్రజలు గెలిపిస్తే ఆయన తన కేబినెట్ లో ఉంటాడని వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. మంగళగిరి పట్టణంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో వేలమంది సాక్షిగా ఆయన హామీ నిచ్చారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు గత ఐదేళ్లుగా సేవలందించిన ఆర్.కె. ని ఈసారి కూడా ఆశీర్వదించాలని జగన్ కోరారు. గత ఐదేళ్లుగా మంగళగిరిని పట్టించుకోకుండా వదలి వేసిన ముఖ్యమంత్రి ఆయన తనయుడు లోకేష్ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని జగన్ ప్రశ్నించారు.



# రాజధాని వార్తలు కలం

## కుర్చీ కోసం ఆరాటం

సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు, ప్రతిపక్ష వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీల జాతరకు తెరలేపారు. ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమంపై ఐదేళ్లపాటు కాలక్షేపం చేసిన అధికార పార్టీ ప్రతిపక్షం కంటే మరిన్ని హామీలు గుప్పించింది. చంద్రబాబు, జగన్ కుర్చీ కోసమే పోటీపడుతున్నట్లు హామీల జాతర స్పష్టంచేస్తోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో చాలా వరకు ఇంకా పెండింగ్‌లో ఉండగానే, మళ్లీ అవే హామీలతో ప్రజలను మోసం చేసేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. అమలుకు నోచుకోని గత హామీలపై ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు టీడీపీ ఓటరుకు జోలపాడుతున్న ట్లుగా మేనిఫెస్టోలు విడుదల చేస్తూ, కుర్చీ కోసం ఎక్కడలేని హామీలను గుప్పించటం శోచనీయం. ప్రతిసారీ అధికారానికి దగ్గరగా వచ్చినట్టే వచ్చిచ పదవిని కోల్పోతున్న వైసీపీ తమ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలను టీడీపీ కొనుగోలు చేసి మంత్రులను చేసిందని, వారందరిపై సస్పెన్షన్‌వేటు వేసేంత వరకు అసెంబ్లీకి వెళ్లేదిలేదంటూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. రాజకీయాల్లో అత్యంత సీనియర్ అయిన శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్ వివక్షతో వ్యవహరించి తమ అభ్యర్థులపై వేటువేయలేదని, అలాగే శాసనసభలో తాము మాట్లాడటానికి సమయం కేటాయించడం లేదని, మైక్‌లు కట్ చేస్తున్నారని దీనిపై ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామని పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. వైసీపీ అధినేత జగన్ మేనిఫెస్టోను విడుదల చేసిన కొన్ని గంటల్లోనే అదే అంశాలను మరిన్ని కేటాయింపులతో తెలుగుదేశం కూడా ప్రకటించడం గమనార్హం.

ఇక ఏడాదిలో ఎన్నికలొస్తాయనే సంకేతాలు రావటంతోనే ఓటర్లను ఆకట్టుకునేందుకు చంద్రబాబు తాయిలాల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు కొన్ని గంటల ముందు కొత్త పథకాలను ఆగమేఘాల మీద అమల్లోకి తేవటం చూస్తేనే సీఎం కుర్చీ కోసం ఆయన ఎంతలా తాపత్రయ పడుతున్నారో అర్థమవుతోంది. ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయని చంద్రబాబు, మళ్లీ గెలిపిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలన్నీ భర్తీ చేస్తాననడం హాస్యాస్పదం. స్వార్థం కోసం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన పాలకులే, ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇవ్వటం ఆశ్చర్యకరం. వాస్తవానికి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో ఉచిత విద్య అందుబాటులో ఉంది. ఆయా విద్యాసంస్థలలో ఖాళీలున్నా ఐదేళ్లుగా ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. ఇప్పుడు తమను గెలిపిస్తే ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని హామీ ఇస్తుంటే ప్రజలు నమ్ముతారా అనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.

చంద్రబాబు తన పేరుతో పలు రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తుండగా, మాజీ సీఎం, తన తండ్రి వైఎస్ఆర్ పేరుతో జీవన బీమా పథకాన్ని అమలు చేస్తామని జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత వైద్యం అందుబాటులోనే ఉన్నా, నైపుణ్యం కలిగిన వైద్యులున్నా... సక్రమంగా పని చేయించలేని వారు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్యాన్ని అందిస్తామనడం హాస్యాస్పదం. కార్పొరేట్ వైద్యానికి రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదంటూ ఇచ్చిన హామీలు మరోసారి కార్పొరేట్ ఆసుపత్రులకు రూ.కోట్ల వర్షం కురిపించేలా మారతాయనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. మహిళలకు 33శాతం రిజర్వేషన్ల అమలు అంశం ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోని పార్టీలు, తాము మళ్లీ అధికారంలోకి వస్తే దాని అమలుకు చర్యలు చేపడతామనడం విడ్డూరంగా ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రెండు పార్టీల మేనిఫెస్టోల్లోని అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరు దాదాపు ఒకేలా ఉండటంతో ప్రజలు ఆలోచనలో పడ్డారు. రెండు మేనిఫెస్టోలను పక్క పక్క పెట్టుకుని పరిశీలిస్తే రెండు పార్టీలు సీఎం కుర్చీ కోసం పడే తాపత్రయమే కనిపిస్తోందంటే అతిశయోక్తి కాదు.

టీడీపీ, వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలు రైతు పథకాల చుట్టే తిరుగుతున్నాయి. రైతు రుణమాఫీ హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. నేటికీ ఆ హామీని నెరవేర్చలేదు. తొలుత ఒకేసారి రుణమాఫీ చేస్తానన్న ఆయన, తర్వాత ఐదు దశలలో చేస్తామన్నారు. మరలా ఎన్నికలు వచ్చినా... రెండు దశల మాఫీ ఇంకా అలానే ఉంది. పాత హామీని నెరవేర్చకుండానే మరోసారి అధికారం కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రకటించిన చంద్రబాబు.. ఆగమేఘాల మీద రైతుల ఖాతాల్లో రెండు దశలలో రూ.4వేల నుంచి రూ.6 వేలు వరకు జమచేశారు. రుణమాఫీ తరహాలోనే ఐదేళ్లపాటు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. తానేమీ తక్కువ కాదన్నట్టు జగన్ కూడా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.50 వేలు ప్రకటించారు. తొలి పంట వేసే సమయానికే రూ.12,500 ఇస్తామని, వడ్డీలేని రుణాలిస్తామని, పంటల బీమా పథకాన్ని ఉచితంగా అమలు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. మరి ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

# మంత్రులకు గుండెదడ..!

**అధికార పార్టీలో, సర్కారులో, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన మంత్రులు సొంత నియోజకవర్గంలో ప్రాబల్యాన్ని కోల్పోయి ఓడిపోయే చరిత్ర ప్రతి ఎన్నికలో సుస్పష్టం. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు మంత్రివర్గంలోని 18 మంది మంత్రులు ఈ పర్యాయం ఎన్నికల బరిలో తమ ప్రాబల్యాన్ని, సత్తాను చాటుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గెలుపు. ఓటములు ఎలా ఉన్నా.. వీరిలో ఎక్కువ మంది తమ ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నారని క్షేత్రస్థాయి సమాచారం.**


అఖిలప్రియ


కాలవ శ్రీనివాసులు


అమరనాథ్ రెడ్డి


కె. జవహర్


కొల్లు రవీంద్ర


చినరాజప్ప


నారా లోకేష్


ప్రత్తిపాటి పుల్లారావు


పి.నారాయణ


చంద్రమోహనరెడ్డి

**రాజధాని వార్తలు** : ముందుగా రాయలసీమ విషయానికి వస్తే కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో మంత్రి భూమా అఖిలప్రియ గట్టిపోటీనే ఎదుర్కొంటున్నారట. వైసీపీ నుంచి గెలిచి.. తరువాత పార్టీ మారటం.. తండ్రిభూమా నాగిరెడ్డి మృతి చెందిన నేపథ్యంలో ఆమెకు మంత్రిపదవి దక్కింది. పర్యాటక శాఖ మంత్రిగా సీఎం మార్కులు సాధించారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రరెడ్డి ఆమెను గుక్క తిప్పుకోనివ్వడం లేదని టీడీపీ వర్గీయులే చెబుతున్నారు. మంత్రి అయినా నియోజకవర్గానికి ఆమెచేసిందేమీ లేదని ప్రజల్లో ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వసంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ఆమె ధీమాగా ఉన్నారట. ప్రత్యర్థి ప్రచారంలో ముందున్నారని, అస్వస్థత పేరిట ఆమె ప్రచారానికి డుమ్మా కొట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

అనంతపురం జిల్లా రాయదుర్గం నుంచి పోటీచేస్తున్న సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వైసీపీ అభ్యర్థి కాపు రామచంద్రా రెడ్డి ఆయనకు గట్టిపోటీ ఇస్తున్నారు. సమాచార శాఖ మంత్రిగా పని చేసిన నేతలు మళ్లీ ఎన్నికల్లో గెలవరనే సెంటిమెంటు భయం ఆయన అనుచరులను వెంటాడుతోంది. మంత్రిగా నియోజక వర్గ ప్రజలకు కాస్త దూరం కావటం కూడా ఈ సారి ఎన్నికల్లో ఆయనకు ఇబ్బందికర పరిస్థితులు తప్పటం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి పోటీచేస్తున్న మంత్రి ఎన్. అమర్‌నాథ్‌రెడ్డి గెలుపు కూడా అంతతేలిక కాదని నియోజకవర్గంలో వినిపిస్తోంది.

కోస్తా జిల్లాలకు సంబంధించి కృష్ణాజిల్లా తిరువూరు నుంచి పోటీచేస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి కె.జవహర్ పరిస్థితి క్లిష్టంగా ఉంది. స్థానిక ఎమ్మెల్మే, వైసీపీ అభ్యర్థి రక్షణనిధి ఆయనకు గట్టిపోటీ ఇస్తున్నారు. టీడీపీ వర్గీయులే ఆయనను ఓడించే ప్రమాదం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇక్కడ జవహర్ గెలవడం కష్టమని ఆ పార్టీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. మచిలీపట్నం నుంచి బరిలో ఉన్న ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కూడా గట్టిపోటీని ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పోటీ హోరాహోరీగాఉంది. స్థానిక మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పేర్ని నానిపై రవీంద్ర విజయం సాధించడం అంత తేలిక కాదనిసమాచారం. ఈ నియోజకవర్గంలో టీడీపీ గెలిస్తే పోర్టు కోసం బలవంతంగా భూములు గుంజేసారని ప్రచారం జరుగుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు టీడీపీపై ఆగ్రహంగా ఉన్నారు. ఇక జనసెన అభ్యర్థిగా ఆర్‌కే మెస్ అధినేత బండి రామకృష్ణ బరిలోకి దిగారు. ఆర్థికంగా ఆయన భాహుబలే. పట్టణ ఓటర్లలో తీవ్ర ప్రభావం చూపుతారని, దీంతో మంత్రి విజయావకాశాలు దెబ్బతింటాయనే ప్రచారం జోరందుకుంది. ఉభయ గోదావది జిల్లాల్లో తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం నుంచి ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ప్రచారంలో కొన్ని చోట్ల ఆయసకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. నెల్లూరు జిల్లాకు సంబంధించి నెల్లూరు టౌన్‌లో పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, సర్వేపల్లి నుంచి పోటీలో ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఈ రెండు చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలు గత ఐదేళ్లలో నియోజకవర్గంలో గట్టిపట్టు సాధించడమే ఇందుకు కారణం. చంద్రమోహన్‌రెడ్డి విషయానికి వస్తే ఆయన గత నాలుగు ఎన్నికల్లో (ఒకటి ఉపఎన్నిక) ఓడిపోయారు. ఈసారి ఆయన గెలిస్తే అద్భుతం జరిగినట్లేనని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మంగళగిరిలో సీఎం తనయుడు ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ విజయం

నల్లేరుపై నడక కాదని తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే రామకృష్ణ నిత్యం ప్రజల్లో ఉండటంతో.. ఆయన కేడర్ చిద్రం కాలేదు. ఇక జనసేన, సీపీఎం, బీఎస్పీ మద్దతుతో అగ్రిగోల్డ్ ఉద్యమ నిర్మాత సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. దీంతో అటు టీడీపీ, ఇటు వైసీపీ అభ్యర్థులకు ముచ్చెమటలు తప్పటం లేదు. ఇక టీడీపీలోనూ లోకేశ్‌కు వ్యతిరేకత పెరుగుతోందని, ఆయనను గెలిపిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని టీడీపీలో కీలక నేతలు భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాసరావు, అయ్యన్నపాత్రుడు, పితాని సత్యనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు సునాయసంగా గెలిచే అవకాశాలు కనిపించటం లేదు. కళా వెంకట్రావు, సుజయ్‌కృష్ణ రంగారావు, దేవినేని ఉమా, నక్కా ఆనంద్‌బాబు కూడా గట్టిపోటీనే ఎదుర్కొంటున్నారు. ప్రత్యర్థులు నువ్వానేనా అనేరీతిలో ప్రచారం చేస్తున్నారు. మిగిలిన కొద్దిరోజుల ప్రజారంలో వీరు గట్టిగా కృషి చేస్తేనే మంత్రు మళ్లీ అసెంబ్లీ మెట్లెక్కుతారని పరిశీలకుల అంచనా.

**19 స్థానాలకు ఉప ఎన్నికలు.. ఇదో రికార్డు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో వైకల్లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాయకత్వాన కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చింది. తరువాత కొద్ది నెలలకే ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. తరువాత చోటుచేసుకున్న పరిణామాల్లో రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తరువాత వై.ఎస్. ఆర్. కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేసి, వైసీపీలో చేరారు. తరువాత అసెంబ్లీలో ఇలా పార్టీ మారినందుకు 18 మంది ఎమ్మెల్యేలు అనర్హత వేటుకు గురయ్యారు. ఆ సమయంలోనే నుల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ 18 స్థానాలతోపాటు చిరంజీవి రాజీనామాతో కొంతకాలంగా ఖాళీగా ఉన్న తిరుపతి సెగ్మెంట్‌కు కూడా 2012లో ఎన్నికలు నిర్వహించారు. ఇక రాష్ట్రంలో 19 స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరగడం గతంలో లేదు. ఈ ఎన్నికల్లో 16 స్థానాలు వైసీపీకి దక్కాయి. రెండుచోట్ల కాంగ్రెస్ పార్టీ గెలిచింది. తెలంగాణ ప్రాంతంలో ఒకచోట టీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన వైసీపీ అభ్యర్థుల్లో ధర్మాన కృష్ణదాస్ (నరసన్నపేట-శ్రీకాకుళం జిల్లా), గొల్ల బాబురావు (పాయకాపురం-విశాఖజిల్లా). తెల్లం బాలరాజు(పోలవళం-గుంటూరు జిల్లా),మేకతోటి సుచరిత (ప్రత్తిపాడు), పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (మాచర్ల-గుంటూరు జిల్లా), బాలినేని శ్రీనివాసరెడ్డి (ఒంగోలు-ప్రకాశం జిల్లా), నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి (కోవూరు), మేకపాటి చంద్రశేఖర్‌డ్డి(ఉదయగిరి-నెట్లూరు జిల్లా), ఆకెపాటి అమర్‌నాథ్ రెడ్డి (రాజంపేట), కె.శ్రీనివాసులు (కోడూరు), జి.శ్రీకాంత్‌రెడ్డి(రాయచోటి-కడప జిల్లా), కె.చెన్నకేశవరెడ్డి (ఎమ్మిగనూరు-కర్నూలుజిల్లా), కె.రామచంద్రారెడ్డి(రాయదుర్గం-అనంతపురంజిల్లా),బి.గురునాథరెడ్డి(అనంతపురం), కరుణాకరరెడ్డి(తిరుపతి-చిత్తూరు జిల్లా) ఉన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థుల్లో తోట త్రిమూర్తులు (రామచంద్రాపురం-తూర్పు గోదావరి), కొత్తపల్లి సుబ్బారాయుడు (నరసాపురం-పశ్చిమ గోదావరిజిల్లా) ఉన్నారు. తెలగాణలోని వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి కొండా సురేఖ కూడా శాససభ్యురాలిగా అనర్హత వేటుకు గురయ్యారు. 2012లో అక్కడ కూడ జరిగిన ఉప ఎన్నికలో ఆమె టీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. 2012లో జరిగిన ఉపున్నికల్లో విజయం సాధించిన 16 మంది 2014 ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. వీరిలో 13 మంది ఓడిపోవడం విశేషం. 2009 ఎన్నికల్లో కడప నుంచి లోక్‌సభకు ఎన్నికైన జగన్.. తండ్రి మరణం తరువాత కాంగ్రెస్‌తో విభేదించి, పార్టీతోపాటు లోక్‌సభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. 2011 లో కడప లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో జగన్‌మోహన్‌రెడ్డి5,45,671 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. అప్పట్లో జగన్‌దేశంలోనే అత్యధిక మెజారిటీ సాధించినవారిలో మూడో స్థానంలో నిలిచారు. తరువాత నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2012లో ఈ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థిగా రాజమోహన్‌రెడ్డి పోటీచేసి, 2,91,745 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు.

– ఖాన్

## ఏపీలో మొత్తం ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రాల వివరాలు

**రాజధాని వార్తలు, అమరావతి** : ఏపీలో మొత్తం ఓటర్లు – 3,93,45,717

రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలు– 45,920

రాష్ట్రంలో ఎన్నికల సిబ్బంది– 3 లక్షలు

ఏపీలో ఎల్లుండి ఉదయం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో మొత్తం ఓటర్ల సంఖ్య, అందులో, మహిళ ఓటర్లు, పురుష ఓటర్లు, తదితర ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఏపీలో మొత్తం ఓటర్లు – 3,93,45,717

సర్వీసు ఓటర్లు– 56,908

ప్రవాసాంధ్ర ఓటర్లు– 5,323

దివ్యాంగ ఓటర్లు– 5,27,734

కొత్తగా ఓటు హక్కు పొందిన వారి సంఖ్య– 10,15,219

రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలు– 45,920

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు– 9000

రాష్ట్రంలో ఎన్నికల సిబ్బంది– 3 లక్షలు

పోలీస్ బలగాలు– ఒక లక్షా 20 వేల మంది

ఎన్నికల సిబ్బంది, ఈవీఎంలు, బలగాల రవాణాకు వినియోగించే బస్సులు – 7600

## చివరి వన్ అవర్ గోల్డెన్ అవర్... నేనందరితోనూ మాట్లాడాలి : చంద్రబాబు



**రాజధాని వార్తలు, అమరావతి** : ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ ఎన్నికలకు సంబంధించి ఆఖరి రోడ్ షో తాడికొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దగా సమయంలేదని, సాయంత్రం ఐదింటికి రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలను ఉద్దేశించి మాట్లాడాల్సి ఉందని అన్నారు. ఎన్నికల ప్రచారం చరమాంకంలో చివరి వన్ అవర్ గోల్డెన్ అవర్ అని, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య సమయంలో రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇదే చివరి సభ అని, మీ ఆశీస్సులు కావాలని, మీ అనుమతితో నిశ్చింతగా వెళతానని చెప్పారు. ఇన్నాళ్ల తన పాలనలో ఎవరికీ ఇబ్బందిలేకుండా చేశానని అన్నారు.

## 'వంద మంది మోదీలొచ్చినా నన్నేం చేయలేరు'

**ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగవద్దు సత్తెనపల్లి రోడ్ షోలో ముఖ్యమంత్రి పిలుపు**



**రాజధాని వార్తలు, సత్తెనపల్లి** : కేసీఆర్ ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. తెలంగాణ ఇస్తే తెరాసను కాంగ్రెస్‌లో కలుపుతానని చెప్పారని, తీరా రాష్ట్ర విభజన జరిగాక సోనియాను దుర్భాషలాడారని ధ్వజమెత్తారు. ఇప్పుడు మోదీ, కేసీఆర్, కోడికత్తి పార్టీ మూడూ కలిసి ఏపీపై దాడి చేస్తున్నాయని మండిపడ్డారు. వంద మంది మోదీలు వచ్చినా తననేమీ చేయలేరని, తన జోలికొస్తే ఎవ్వర్నీ వదిలిపెట్టబోనని హెచ్చరించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో చంద్రబాబు మంగళవారం ఎన్నికల ప్రచార రోడ్ షో నిర్వహించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే మాకూ కావాలని పట్టుబట్టిన కేసీఆర్, ఇప్పుడు ఏపీ ప్రత్యేక హోదాకు మద్దతిస్తానంటున్నారని ధ్వజమెత్తారు. మోదీకి ఓటేస్తే ముస్లింలకు భద్రత ఉండబోదని, ఇప్పటికే అసోంలో బర్మా ముస్లింలంటూ లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు.

"జగన్ ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఆయన వస్తే పోలవరం ఆగిపోతుంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు కేసీఆర్ చేతిలోకి వెళ్లిపోతాయి. పోతిరెడ్డి పాడు, ముచ్చుమర్రి హెడ్ రెగ్యులేటరీలు మూతబడతాయి. అప్పుడు రాయలసీమకు చుక్క నీరు రాదు. కేసుల మాఫీ కోసం కేసీఆర్, మోదీ చెప్పినట్లు జగన్ ఆడతారు."

"ఎన్నికల ప్రచారం సాయంత్రానికి ముగియనున్న నేపథ్యంలో.. వైకాపా నాయకులు అరాచకాలు సృష్టించేందుకు సిద్ధమయ్యారు. పసుపు చొక్కాలు వేసుకొని నేరాలకు పాల్పడతారని సమాచారం ఉంది. కేసీఆర్ పంపిన సొమ్మును పంచి ఓటర్లను కొనే ప్రయత్నం చేస్తారు. ఈ అరాచకాల పట్ల మీరంతా అప్రమత్తంగా ఉండాలి. నీతిమాలిన వ్యక్తి ఇచ్చే డబ్బులు మనకు అవసరమా? కేసీఆర్ ఏమీ చేయకుండా తెలంగాణలో 80కిపైగా సీట్లు గెలిచారు. ఇప్పుడు అన్ని ఎంపీ సీట్లు గెలుస్తారట! ఈ లెక్కన మనం ఎన్ని సీట్లు గెలవాలి? తెలంగాణ దగ్గర తలదించుకోవాలా మనం." అని సీఎం ప్రశ్నించారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగవద్దని సీఎం ప్రజలకు సూచించారు.

## వెన్నుపోట్లు పొడిచిన చంద్రబాబుని ఆ దేవుడు ఎందుకు ఆశీర్వదించాడో!: వైసీపీ నేత రోజా



**రాజధాని వార్తలు,అమరావతి** : మహిళల సమస్యలపై గళం ఎత్తేందుకు అసెంబ్లీలో నేను ఉండాలని ప్రజలు అనుకుంటున్నారని వైసీపీ ఎమ్మెల్యే రోజా అన్నారు. ఈరోజు ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో తన నియోజకవర్గం నగరిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ, కాల్ మనీ-సెక్స్ రాకెట్ కేసులో ఏ ఒక్క నేరస్తుడికైనా శిక్ష పడిందా? నేరస్తులకు అండగా ఉంటూ, నువ్వు వెధవ పనులు చేస్తూ, దాన్ని నేను నిలదీస్తే నన్ను అసెంబ్లీకి రాకూడదని చెప్పడం ఎంత వరకు సమంజసం? నువ్వో, నీ తండ్రి ఖర్జూరపు నాయుడో అనుకుంటే కాదు, భగవంతుడు అనుకోవాలి. వెన్నుపోట్లు పొడిచిన చంద్రబాబునాయుడుని ఆ దేవుడు ఎందుకు ఆశీర్వదించాడో తెలియదుగానీ ఇప్పటికి మూడు సార్లు ముఖ్యమంత్రి అయ్యాడు. ఈ మూడు సార్లు రాష్ట్రంలో కరవు తప్ప ఏమీ రాలేదు. ఈసారి అయినా ప్రజలు మోసపోవద్దు. ప్రజల మీద అభిమానం ఉన్న వ్యక్తి జగన్ ని గెలిపించుకోవాలి' అని రోజా కోరారు.

## వైకాపా శ్రేణుల అత్యుత్సాహం: 29 పూరిళ్లు దగ్ధం


పూరిళ్లు దగ్ధమవుతున్న దృశ్యం

**రాజధాని వార్తలు, డెంకాడ** : విజయనగరం జిల్లా డెంకాడ మండలం చల్లంగిపేట పంచాయతీ శివారులోని పోతయ్యపాలెం గ్రామంలో వైకాపా కార్యకర్తల అత్యుత్సాహానికి 29 పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. నెల్లిమర్ల వైకాపా అభ్యర్థి బడుకొండ అప్పలనాయుడు ప్రచారం చేస్తుండగా కార్యకర్తలు బాణసంచా కాల్చారు. ఈ ఘటనలో నిప్పు రవ్వలు పూరిళ్లపై పడ్డాయి. శరవేగంగా మంటలు వ్యాపించడంతో 29 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో బాధితులు సర్వం కోల్పోయారు. ఇళ్లల్లోని ధాన్యం, వంట సామాగ్రి, నగదు, బంగారు వంటి వస్తువులు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రెండు అగ్నిమాపక శకటాలతో మంటలను అదుపు చేశారు. అప్పటికే సర్వం నష్టం జరిగిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. బాధితులను తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణస్వామి నాయుడు, పలువురు నాయకులు పరామర్శించారు.

రాజధాని వార్త పత్రిక కోసం సంప్రదించండి
ఫోన్ : 7680994755

## 2.68 లక్షల ఓటర్లు నా వైపే

**మంగళగిరిలో గెలుపు నాదే: లోకేశ్**



**రాజధాని వార్తలు, తాడేపల్లి** : రాజధానిని అమరావతి నుంచి తరలించాలనే యోచనలో వైకాపా అధ్యక్షుడు జగన్ ఉన్నారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అభ్యర్థి నారా లోకేశ్ ఆరోపించారు. మేనిఫెస్టోలో అమరావతి పేరును ఎందుకు ప్రస్తావించలేదని వైకాపా నాయకులను ప్రశ్నించాలని ప్రజలను కోరారు. సోమవారం ఉండవల్లిలో ఆయన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. ఎంత కష్టపడుతున్నా ముఖ్యమంత్రిని ప్రతిపక్షాలు ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. కేంద్రంలో మోదీ, పక్క రాష్ట్రంలో కేసీఆర్, ఇక్కడ జగన్ ముగ్గురూ కలిసి ఎట్టి పరిస్థితుల్లో ఓడించాలని కంకణం కట్టుకున్నారని అన్నారు. 'కేసీఆర్ రిటర్న్ గిఫ్టు అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రులు సిద్ధంగా ఉన్నారు. రిటర్న్ గిఫ్టును సిక్స్ కొట్టేందుకు. నన్ను ఓడించేందుకు వలస పక్షులు పదుల సంఖ్యలో ప్రచారం చేస్తున్నాయి. ఎంత మంది వచ్చినా మంగళగిరి నియోజకవర్గంలోని 2.68 లక్షల ఓటర్లు నా వైపే ఉన్నారు. నన్ను ఓడించటానికి కేసీఆర్ మంగళగిరికి రూ.200 కోట్లు పంపారు' అని ఆరోపించారు. అమరావతి శంకుస్థాపనకు వచ్చిన నరేంద్రమోదీ చెంబుడు నీళ్లు, మట్టి మన ముఖాన కొట్టి మోసం చేశారని అన్నారు. నీళ్లు, మట్టి ఇచ్చి మోదీ తిరిగి చూడలేదన్నారు. రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇవి డ్రైనేజీకి సరిపోవన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో ఎవరూ ఊహించని విధంగా రహదారులు, భవనాలు నిర్మించామని చెప్పారు. ఉండవల్లిలో దాదాపు 2,500మంది రైతు కూలీలకు నెలనెలా రూ.2,500 పింఛన్ అందజేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా ఇలా జరగలేదని తెలిపారు.

రాజధాని వార్తలు ఆన్‌లైన్‌లో చూడండి
Rajadhanivartalu.com

# ఊరు పిలుస్తోంది

- 9,10వ తేదీల్లో తరలివస్తున్న ఓటర్లు
- హైదరాబాద్ నుంచే 500పైగా ప్రత్యేక బస్సులు
- బెంగళూరు నుంచి 105, చెన్నై నుంచి 25 బస్సులు
- సికింద్రాబాద్ నుంచి రెండు జనసాధారణ్ రైళ్లు





**రాజధాని వార్తలు, అమరావతి :** సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు జనాలు సొంత ఊళ్లకు బయలుదేరుతుండడంతో బస్సులు, రైళ్లలో బెర్తులు, సీట్లు నిండిపోయాయి. తొలి దశలో రెండు తెలుగు రాష్ట్రాల్లో పోలింగ్ జరుగుతున్నందున హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలతోపాటు పొరుగునున్న బెంగళూరు, చెన్నై నుంచి పెద్ద సంఖ్యలో సొంత ఊళ్లకు ప్రయాణమవుతున్నారు. గత మార్చి నెలలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే చాలా మంది రోజు వారీగా నడిచే రైళ్లు, బస్సుల్లో సీట్లు, బెర్తులను రిజర్వేషన్ చేయించుకున్నారు. ఎన్నికల రద్దీని క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా రెండు రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులను నడుపుతున్నాయి. ఒక్క హైదరాబాద్ నుంచే 10వ తేదీన ఏపీఎస్ఆర్టీసీ 272 ప్రత్యేక బస్సులు, టీఎస్ఆర్టీసీ 250 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాయి. అలాగే దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్న వేసవి ప్రత్యేక రైళ్లలో ఎన్నికలు జరిగే రోజుకు అటు, ఇటుగా ఉండడంతో వాటిలో రిజర్వేషన్లు చేయించుకుంటున్నారు. వేసవి రద్దీ దృష్ట్యా నడుపుతున్న రైళ్లు కాస్తా ఎన్నికల రైళ్లుగా మారాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏసీ తరగతులు, స్లీపర్ కోచ్‌లున్న ప్రత్యేక రైళ్లను వెబ్‌సైట్‌లో పెట్టిన కొద్ది సేపటికే నిండిపోయినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. నెంబరు 07457 సికింద్రాబాద్- కాకినాడ టౌన్ ప్రత్యేక రైలుకు 10వ తేదీన వెయిటింగ్ లిస్ట్ 150 దాటిపోయినట్లు చెబుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నడిచే అన్ని రైళ్లలోనూ ఈనెల 9,10వ తేదీల్లో బెర్తులు లభించని పరిస్థితి నెలకొని ఉందంటున్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య నడిచే దురంతో, గరీబ్‌రథ్ వంటి ఏసీ రైళ్లతోపాటు గోదావరి, విశాఖ, జన్మభూమి, ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ వంద కంటే ఎక్కువ కొనసాగుతూ కొండవీటి చాంతాడునుతలపిస్తోందని పేర్కొంటు న్నారు. కొన్ని రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ సామర్థ్యం కూడా దాటిపోవడంతో నోరూమ్ అని చూపుతోందని చెబుతున్నారు. ఇక సాధారణ ప్రయాణికుల కోసం రైల్వేశాఖ 9,10వ తేదీల్లో సికింద్రబాద్- కాకినాడ మధ్య జనసాధారణ్ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. అలాగే 9వ తేదీ నుంచి 15 వరకూ సికింద్రాబాద్-విజయవాడ మధ్య జనసాధారణ్ ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్లలో అన్నీ సెకండ్ క్లాస్ జనరల్ బోగీలే ఉండడంతో రిజర్వేషన్ లభించని వారు ఈ రైళ్లలో సొంత ఊళ్లకు పయనమయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

### హైదరాబాద్ నుంచే డిమాండు

రాష్ట్రానికి చెందిన అనేక మంది ఉద్యోగ, ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వీరి కోసం ఏపీఎస్ఆర్టీసీ, టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నాయి. హైదరాబాద్ నుంచి ఈనెల 9వ తేదీన 72 బస్సులు, 10వ తేదీన 211 బస్సులను ఏర్పాటు చేయగా, అవన్నీ నిండిపోయినట్లు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.వి.ఆర్.కె.ప్రసాద్ 'విశాలాంధ్ర' ప్రతినిధికి తెలిపారు. మరిన్ని అదనపు బస్సులను 10వ తేదీన నడిపే విషయమై అధికారులతో సమీక్షించి 62 బస్సులను సమకూర్చడంతో మొత్తం 272 బస్సుల్లోని సీట్లు నిండిపోయినట్లు చెప్పారు. అలాగే బెంగళూరు నుంచి 105 బస్సులు, చెన్నై నుంచి 25 బస్సులను రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలకు నడుపుతున్నట్లు ఆయన వివరించారు. ముఖ్యంగా హైదరాబాద్ వైపు నుంచి రద్దీ పెరిగే అవకాశం ఉండడంతో మరో 60 బస్సులను కూడా సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బంది, సామగ్రిని ఆయా పోలింగ్ స్టేషన్లకు తరలించేందుకు 6,500 బస్సులను సమకూర్చినట్లు ప్రసాద్ తెలిపారు.

## ఈసారి జనసేనకు అవకాశం లేదు!: సినీ నటుడు కృష్ణుడు


ప్రతిపక్షంగా వైసీపీ బలంగా ఉంది
జనసేన ఎంత ప్రభావం చూపుతుందో చెప్పడం కష్టం



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో టీడీపీ, వైసీపీ కాకుండా మూడో పార్టీకి తగినంత వ్యాక్యూమ్ లేదని సినీనటుడు కృష్ణుడు అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షమైన వైసీపీ బలంగా ఉన్నప్పుడు జనసేన ఎలాంటి ప్రభావం చూపుతుందో చెప్పడం కష్టమన్నారు. 2014లో పవన్ కల్యాణ్ బేషరతుగా చంద్రబాబుకు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ఈరోజు పవన్ ఎన్నిరకాలుగా విమర్శించాలో అన్నిరకాలుగా విమర్శించారని వ్యాఖ్యానించారు. టీడీపీ 40 సీట్లను వెయ్యి ఓట్ల మెజారిటీతో గెలిచిందనీ, మరో 20-30 సీట్లను 2-3 వేల ఓట్ల తేడాతో దక్కించుకుందని గుర్తుచేశారు. ఇందుకు పవన్ ఫ్యాక్టర్ కూడా ఓ కారణం కావచ్చన్నారు. ఓ టీవీ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కృష్ణుడు మాట్లాడుతూ.. ఈసారి జనసేనకు తగినంత అవకాశం లేదన్నది తన అభిప్రాయమన్నారు. 1980ల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎన్టీ రామారావు టీడీపీని పెట్టారనీ, అప్పుడు ఆ వ్యాక్యూమ్ ఉందని అన్నారు. కృష్ణుడు ఇటీవల జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే.

## జగనే ఆంధ్రప్రదేశ్ కు ఇప్పుడు సరైన లీడర్.. ఆయనకు ఒక్క అవకాశం ఇవ్వండి!: హీరో రాజశేఖర్

**జగన్ ను గతంలో అపార్థం చేసుకున్నాను**
**ఇప్పుడు అతనే సరైన లీడర్ అని నమ్ముతున్నా**
**నేనేమీ పెద్ద పెద్ద ప్యాకేజీలు పుచ్చుకోలేదు**



**రాజధాని వార్తలు, అమరావతి :** వైసీపీ అధినేత జగన్ ను అప్పట్లో తాను నమ్మలేదనీ, అపార్థం చేసుకున్నానని ప్రముఖ సినీ నటుడు రాజశేఖర్ తెలిపారు. కానీ ఇన్నేళ్ల కాలంలో జగన్ లో నిజమైన మార్పును తాను గమనించానని వ్యాఖ్యానించారు. జగన్ ఆంధ్రప్రదేశ్ కు సరైన లీడర్ అని తాను ఇప్పుడు నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. జగన్ కు ఒక్క అవకాశం ఇవ్వాలని ఏపీ ప్రజలను కోరారు. తాను జగన్ కు మద్దతుగా నిలబడుతున్నానని స్పష్టం చేశారు. ఇటీవల భార్య జీవితతో కలిసి రాజశేఖర్ వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు ఇప్పటికే ఎన్నో అవకాశాలు ఇచ్చామని రాజశేఖర్ తెలిపారు. ఇప్పుడు జగన్ కు ఓసారి ఛాన్స్ ఇవ్వాలన్నారు. ఈ మాటను తాను నిజాయతీగా చెబుతున్నాననీ, ఇందుకోసం తాను కానీ, తన కుటుంబ సభ్యులు కానీ పెద్దపెద్ద ప్యాకేజీలు పుచ్చుకోలేదని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో కొందరు తన కుటుంబ సభ్యులపై తప్పుడు వదంతులు వ్యాప్తి చేస్తున్నారని రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవన్నీ అబద్ధాలేనని తేల్చిచెప్పారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతీఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు రాజశేఖర్ ఈరోజు వరుస ట్వీట్లుచేశారు.

## 'కేసీఆర్.. మీకు ఆంధ్రాలో ఏం పని?'

**తెదేపా ఎంపీ కనకమేడల ప్రశ్న**



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు, సీట్లు లేని తెరాస అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్‌కు ఇక్కడేం పని అని తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కావాలన్న కోరికే వైకాపా పుట్టుకకు కారణం తప్ప ఆ పార్టీకి సిద్ధాంతాలేమీ లేవని విమర్శించారు. కేసుల నుంచి బయటపడేందుకు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను జగన్ తాకట్టు పెట్టారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక హోదా ఇస్తారని నమ్మి మోసపోయామని చెప్పారు. నదుల అనుసంధానం, పోలవరం, పట్టిసీమపై జగన్ వైఖరి ఏంటో చెప్పాలన్నారు. పోలవరం ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును కేసీఆర్ వెనక్కి తీసుకుంటారా? అని ప్రశ్నించారు. మోదీ దర్శకత్వంలో కేసీఆర్, జగన్ పనిచేస్తున్నారని ఆరోపించారు.

## చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** హైదరాబాద్ నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ రైల్లో అగ్నిప్రమాదం సంభవించింది. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెంబర్ 6లో నిలిచి ఉన్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక్కసారిగా దట్టమైన పొగలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. నిలిచి ఉన్న రైలు కావడం.. ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుదాఘాతం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

## సింహం సింగిల్ గానే వస్తుంది: వైఎస్ షర్మిల


**పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీ చేస్తున్నాం**
**టీడీపీ ఆరోపణలన్నీ అవాస్తవం**
**పొత్తుల కోసం వెంపర్లాడేది చంద్రబాబేనన్న షర్మిల**



**రాజధాని వార్తలు, అమరావతి :** ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీ చేస్తోందని, బీజేపీతో, టీఆర్ఎస్ తో పొత్తులు పెట్టుకున్నట్టు తెలుగుదేశం చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలేనని వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. పొత్తుల కోసం నిత్యమూ వెంపర్లాడేది చంద్రబాబేనని అన్నారు. జగన్ సింహం వంటివాడని, సింహం సింగిల్ గానే వస్తుందని, నక్కలే గుంపులుగా వస్తాయని తనదైన శైలిలో వ్యాఖ్యానించి, సభకు వచ్చిన కార్యకర్తలు, అభిమానుల్లో షర్మిల ఉత్సాహం నింపారు. చంద్రబాబు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, జనసేనలను తోడు తెచ్చుకున్నారని ఆరోపించిన ఆమె, అన్ని జాతీయ మీడియా సంస్థల సర్వేలూ వైసీపీదే అధికారమని చెబుతున్నాయని అన్నారు. గెలుస్తామన్న నమ్మకం లేకనే కేజ్రీవాల్, మమతా బెనర్జీ, దేవెగౌడ, ఫరూక్ అబ్దుల్లా తదితర ప్రాంతీయ పార్టీల నేతలను ఆయన ప్రచారానికి పిలుచుకు వచ్చారని, అయినా ప్రజలు వైసీపీ వెంటే ఉన్నారని అన్నారు.


## చంద్రబాబు ఏం చేసినా లోకేశ్ గెలవడు: ఆర్కే

- **ఎన్ని కుట్రలు చేసినా వైసీపీ జెండా రెపరెపలాడుతుంది**
- **లోకేశ్ కు 'మంగళగిరి' అని పలకడమే రాదు**
- **పోలింగ్ డేట్ కూడా తెలియని వ్యక్తిని ప్రజలు ఎన్నుకుంటారా?**



**రాజధాని వార్తలు, అమరావతి :** చంద్రబాబు ఏం చేసినా నారా లోకేశ్ గెలవలేదని, ఓటమి ఖాయమని మంగళగిరి వైసీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) జోస్యం చెప్పారు. మంగళగిరిలో ఈరోజు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 11న జరిగే ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని, చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా వైసీపీ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న లోకేశ్ పై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీ అబ్బాయి 9వ తారీఖున జరిగే ఎన్నికల్లో గెలవలేడు. నువ్వు (చంద్రబాబు) ఎన్ని చేసినా మీ అబ్బాయి మంగళగిరిలో గెలవలేడు. నువ్వు ఎన్ని చేసినా 11వ తారీఖున జరిగే ఎన్నికల్లో వైసీపీ గెలిచి తీరుతుంది. 'మంగళగిరి' అని పలకడమే రాదు. మంగళగిరి నైసర్గిక స్వరూపం తెలియదు. నామినేషన్ వేయడం రాదు. ఎన్నికల పోలింగ్ డేట్ తెలియదు. అలాంటి వ్యక్తిని మంగళగిరి ప్రజలు ఎలా ఎన్నుకుంటారు?' అంటూ లోకేశ్ పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## ప్రలోభాలకు దిగితే కఠిన చర్యలు: ద్వివేది



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ముగిసిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. ఒకటి రెండు చోట్ల పోలీసులు ప్రచారాన్ని ఆపారని అన్నారు. ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు ఆ ప్రాంతంలో ఉండరాదని.. బయట వ్యక్తులు వాళ్ల ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశామని.. నగదు, మద్యం, కానుకల స్వాధీనంలో ఏపీ రెండో స్థానంలో ఉందన్నారు. రాజకీయ పార్టీలు ఈ రెండు రోజులు సహకరించాలని కోరారు. ప్రలోభాలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం కావున.. సెల్‌ఫోన్‌లు తీసుకుని రావద్దని విజ్ఞప్తి చేశారు.

## కడపలో మెజారిటీ మాదే : సీఎం రమేశ్



**రాజధాని వార్తలు, కడప :** బీజేపీ, వైసీపీ ఒకే తాను ముక్కలని టీడీపీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ సీఎం రమేశ్ విమర్శించారు. అభివృద్ధి కోసం, టీడీపీకే ఓటు వేస్తామని ప్రజలు అంటున్నారని చెప్పారు. మోదీ చెప్పినట్లు ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని.. కడపకు సాగు నీళ్లు ఇచ్చామని.. మెజారిటీ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జగన్ క్రిమినల్ ప్లాన్స్ చెల్లవన్నారు.

## టీడీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు: జీవీఎల్



**రాజధాని వార్తలు, కడప :** రాష్ట్రంలో టీడీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. కడప జిల్లాలో టీడీపీ ఒక్క సీటు కూడా గెలవలేదని పేర్కొన్నారు. మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ ఎన్నికల్లో టీడీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాదన్నారు. కడప పార్లమెంట్ స్థానానికి టీడీపీ రూ.300 కోట్లు ఖర్చే చేస్తోందని ఆరోపించారు. మొత్తంగా ఈ ఎన్నికల్లో టీడీపీ 15వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.

## బాలయ్య గెలుపు ఖాయం: వసుంధర



**రాజధాని వార్తలు, అనంతపురం :** హిందూపురంలో సినీ నటుడు బాలకృష్ణ గెలుపు ఖాయమని ఆయన భార్య వసుంధర ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అయ్యాయని ఆమె అన్నారు. ఈ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ హిందూపురంలో ప్రచారం చాలా బాగా జరిగిందన్నారు. ఇక్కడ నీటి సమస్య పరిష్కారమయ్యిందన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు చాలా బాగున్నాయని ప్రజలే మెచ్చుకుంటున్నారని ఆమె అన్నారు. పథకాల గురించి ప్రజలే చెబుతున్నారని.., తనకంటే వాళ్లకే బాగా తెలుసునని వసుంధర అన్నారు. నియోజకవర్గంలో ఇంకా చిన్న సమస్యలు ఉన్నాయని మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే బాలకృష్ణ సమస్యలు పరిష్కరిస్తారని ఆమె చెప్పారు. ప్రజలంతా తమవైపే ఉన్నారని వసుంధర సంతోషం వ్యక్తం చేశారు.

# స్వేచ్ఛగా ఎన్నికలు

**ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ సమీక్ష**



**రాజధాని వార్తలు, అమరావతి :** అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు స్వేచ్ఛగా, పూర్తి శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లా డుతూ ఈనెల 11న జరగనున్న ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఈ రెండు రోజులు మరింత అప్రవత్తంగా ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం వంటివి పంపిణీ చేసే యత్నాలను నియం త్రించాలన్నారు. జిల్లాల్లో మోడల్ కోడ్ అమలు బృందాలు మరింత చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ ఎలక్ట్రానిక్ వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టిని సారించాల న్నారు. గోడౌన్లు, షోరూమ్‌లలో తనిఖీలు నిర్వహిం చాలని ఆదేశించారు. రాష్ట్రంలో అత్యంత సమస్యా త్మకమైన పోలింగ్ కేంద్రాలు 25 నుంచి 30 వరకు ఉన్నట్టు గుర్తించామని, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వృద్ధులు, విక లాంగులు, గర్భవతులు వంటి ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీజీపీ ఆర్పీ ఠాకూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.106 కోట్లు పట్టుబడ్డాయని తెలిపారు. బం గారం, ఇతర వస్తువులను కూడా మోడల్ కోడ్ తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయ న్నారు. కోడ్ ఉల్లంఘనపై 3,309 కేసులు నమోదై నట్లు తెలి పారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, షామియానా, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించాలని కలక్టర్లను ఆదేశించారు. 'మై ఓట్ క్యూ' యాప్‌పై ప్రజలకు అవగాహన కలిపించి, ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు ప్రైవేటు సిబ్బందిని తీసుకోవద్దని, ప్రభుత్వ సిబ్బందిని మాత్రమే తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.సాంబశివరావు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.రవిచంద్ర, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, శాంతి- భద్రతల అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నర్, ఎక్సైజ్, వాణిజ్య-పన్నుల శాఖల కమిషనర్లు ముఖేష్ కుమార్ మీనా, శ్యామల రావు, అదనపు సీఈఓలు సుజాత శర్మ, వివేక్ యాదవ్, సంయుక్త సీఈఓ డి.మార్కండేయులు పాల్గొన్నారు.

## అవినీతిపై పోరాడాలంటే 'జనసేన'ను గెలిపించాలి : పవన్

- **మేము అధికారంలోకొస్తే..**
- **కేంద్రంతో సమానంగా రాష్ట్ర ఉద్యోగులకు జీతాలు**
- **ప్రభుత్వ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే పెన్షన్ ఇస్తాం**



**రాజధాని వార్తలు, అమరావతి :** రాజకీయాల్లో మార్పు తీసుకొచ్చేందుకు వచ్చిన జనసేన పార్టీని అందరూ ఆదరించాలని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కోరారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, అవినీతిపై పోరాడాలంటే జనసేన పార్టీని గెలిపించాలని కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచనున్నట్టు హామీ ఇచ్చారు. దీని కోసం న్యూ పే కమిషన్ ను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పద్ధతిలోనే పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రతి టౌన్ లో సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్ హౌసింగ్ బోర్డులు ఏర్పాటు చేసి ఇళ్లు కట్టిస్తామని, ఎడ్యుకేషన్ రిఫామ్స్ కమిషన్ ఏర్పాటు చేసి టీచరు, విద్యార్థుల కోసమే పని చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీచర్స్ కేవలం విద్యార్థుల కోసమే పనిచేయాలి తప్ప ఏ పార్టీల నాయకుల కోసం పనిచేయకూడదని కఠిన నిబంధనలు అమలు చేస్తామని, పాలకొల్లు వాసుల నీటి కష్టాలు తీరుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్ పై పవన్ విమర్శలు గుప్పించారు. తిరుమలకు చెప్పులు వేసుకుని వెళ్లిన వ్యక్తి జగన్ అని, దేవుడిపై గౌరవం లేని వ్యక్తికి ప్రజలపై ఉంటుందా? అని ప్రశ్నించారు. కాగా, ఈ ఎన్నికల ప్రచారంలో పవన్ కల్యాణ్ తో కలిసి ప్రముఖ హీరో అల్లు అర్జున్ పాల్గొన్నాడు.

## చంద్రబాబు నాయకత్వం అవసరం : నాని



**రాజధాని వార్తలు, అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థత వల్లే రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్తోందని విజయవాడ తెదేపా ఎంపీ అభ్యర్థి కేశినేని నాని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని, ఆయన నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమని అన్నారు. విజయవాడలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.


ప్రపంచంలో ఎక్కడా ఒక రాజకీయ నేతపై 31 కేసులు లేవని, ప్రతిపక్ష నేత జగన్‌పై ఈ కేసులు ఉండడం రాష్ట్రానికి సిగ్గు చేటని ధ్వజమెత్తారు. ఆయన కుటుంబం ఆరాచక శక్తులకు నెలవని విమర్శించారు. 25 మంది వైకాపా ఎంపీ అభ్యర్థుల్లో 12 మందిపై కేసులు ఉన్నాయని విమర్శించారు. చంద్రబాబును గతంలో పదేళ్లు ప్రతిపక్ష హోదాకు పరిమితం చేయడం వల్లే రాష్ట్రం విడిపోయిందన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని, అందుకే గత ఎన్నికల్లో బాబుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు.

## దేశీయ రేంజ్ రోవర్.. బుకింగ్స్ ప్రారంభం

**దిల్లీ :** భారత్‌లో తయారు చేసిన రేంజ్ రోవర్ వేలర్ వాహనానికి సంబంధించి బుకింగ్స్ ప్రారంభించినట్లు జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా (జేఎల్ఆర్) మంగళవారం ప్రకటించింది. దీని ధర రూ. 72.47 లక్షలుగా (ఎక్స్ షోరూం దిల్లీ) ఉంది. ఈ మోడల్ పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో లభించనున్నట్లు సంస్థ ప్రకటించింది. 'ఆటోమొబైల్ రంగంలో ఉన్న పోటీని ద ృష్టిలో పెట్టుకొని అత్యుత్తమ డిజైన్, లగ్జరీ, ఆధునిక సాంకేతికను అందిస్తూనే అందుబాటు ధరల్లో అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న రేంజ్ రోవర్ వేలార్ ప్రజల అభిరుచులకు మరింత దగ్గరగా ఉంటుంది' అని జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాకుండా దేశీయంగా ఈ మోడల్‌ను తయారు చేస్తున్నామంటే భారత మార్కెట్‌పై సంస్థకు ఉన్న నిబద్ధతను తెలిసేలా చేస్తుందని రోహిత్ అన్నారు. ఈ మోడల్‌ను బుక్ చేసుకున్నవారికి మే నెల మొదటి వారంలో డెలివరీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇప్పటికే ఎక్స్‌ఈ, ఎక్స్‌ఎఫ్, ఎక్స్‌జే, ఎఫ్-పేస్, డిస్కవరీ స్పోర్ట్, రేంజ్ రోవర్ ఎవోక్ లాంటి మోడళ్లను దేశీయంగా ఉత్పత్తి చేస్తుంది.



## కడప పెద్ద దర్గాను సందర్శించిన సాయిధరమ్‌తేజ్



**రాజధాని వార్తలు, కడప :** కడప పెద్ద దర్గాను సినీ నటుడు సాయిధరమ్ తేజ్ దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకులు ఆయనకు ముస్లిం సంప్రదాయంలో స్వాగతం పలికారు. అనంతరం పూల చాదర్‌ను చదివించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు దర్గా విశిష్టతను వివరించారు. దర్గాకు సాయిధరమ్ తేజ్ వచ్చారన్న వార్త తెలియడంతో ఆయన్ను చూసేందుకు పెద్ద ఎత్తున జనం దర్గాకు తరలివచ్చారు.

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చిత్రలహరి'. కల్యాణి ప్రియదర్శన్, నివేదా పేతురాజు కథానాయికలు. వెన్నెల కిషోర్, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 12న ప్రేక్షకుల ముందుకు






# వైఎస్సార్‌సీ పార్టీ కి జమాయత్ ఉలేమా కౌన్సిల్ మద్దతు

**రాజధాని వార్తలు, అమరావతి :** 'ఆంధ్ర ప్రదేశ్ ఉలేమా కౌన్సిల్'రాష్ట్ర అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఫారూఖ్ ఖాస్మి, జనరల్ కార్యదర్శి హాఫిజ్ మహమ్మద్ అలీ, గౌరవ పెద్దలు, మేధావులు, ఉలేమాలు ఇంకా ముస్లిం మత పెద్దలు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై యస్ జగన్మోహన రెడ్డిగారిని కలిసి అనేక అంశాలపై చర్చించారు.

రాష్ట్ర పెరిస్థితులపై , సమస్యలపై, ముఖ్యంగా మైనారిటీల సమస్యలను అయన దృష్టికి తీసుకెళ్లారు. జగన్ గారు సానుకూలంగా స్పందించి వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు తక్షణంగా తీసుకోవటం, అక్రమణదారుణలను చట్టపరిధి లోకి తీసుకు రావటం, ఇంకా మైనారిటీల కొరకు విద్యాలయాలను, మెడికల్ కాలేజీలను స్థాపించటం, చట్ట సభలలో అవకాశం కల్పించటం, రాజకీయంగా ముస్లింలు ఎదగటానికి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా నిమ్న కులాలవారికి, ఇతర మైనారిటీ సోదరులకు, ప్రజలందరికి సంక్షేమం, అభివృద్ధి కొరకు చర్యలు తీసుకుంటామన్నారు. కాబట్టి ఏప్రిల్ పదకొండవ (11-04-2019) తారీఖున రానున్న ఎన్నికలల్లో మన అమూల్యమైన ఓటు ను ఫాన్ గుర్తుకే వేసి వైస్సార్ పార్టీ ని అఖండ మెజారిటీ తో గెలిపించమని ముస్లింలందరిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జమాయత్ ఉలేమా అధ్యక్షులు ముఫ్తి ఫారూఖ్ కొరారు.

## శ్రీవారి సేవలో గవర్నర్ నరసింహన్ దంపతులు



**రాజధాని వార్తలు, తిరుమల :** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని గవర్నర్ నరసింహన్ దంపతలు మంగళవారం దర్శిచుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో గవర్నర్ దంపతులు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు వారు క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవరాహస్వామిని దర్శించుకున్నారు. గవర్నర్ దంపతులు శ్రీవారి పుష్కరిణిలోకి చేరుకొని పవిత్ర జలాలను ప్రోక్షణం చేసుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న గవర్నర్ దంపతులకు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల ఇన్‌ఛార్జి జేఈవో లక్ష్మీకాంతం ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి, మేళతాళాలతో శ్రీవారి సన్నిధికి తీసుకెళ్లారు. స్వామి వారి దర్శనానంతరం హుండీలో కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలుకగా తీర్థప్రసాదాలను, స్వామివారి చిత్రపటాన్ని గవర్నర్ దంపతులకు తితిదే ఈవో, జేఈవో అందజేసి సత్కరించారు.

# కృష్ణా జిల్లాలో పోటా... పోటీ...?

**- కృష్ణాజిల్లాలో మెజార్టీ స్థానాల్లో త్రిముఖ పోరు**

**కృష్ణా జిల్లా క్షేత్రపరిశీలన**

**రాజధాని వార్తలు, అమరావతి :** ఓవైపు కృష్ణానది ప్రవాహం.. మరోవైపు కొండపై కొలువుదీరిన కనకదుర్గమ్మ.. వీటితో పాటు రాజకీయంగా.. సామాజికంగా.. ఆర్థికంగా కూడా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన కృష్ణా జిల్లాలో రాజకీయం వాడీవేడిగా ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. భౌగోళికంగా డెల్టా, తీర, మెట్ట ప్రాంతం కలిసి.. తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్న ఈ జిల్లాలో 16 నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గాల వారీగా చేసిన అభివృద్ధి పనులతో గెలుస్తామని తెదేపా అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, సానుభూతితో గెలుస్తామని వైకాపా ఆశాభావంతో ఉంది. జనసేన ఏ మేరకు ఓట్లు చీలుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

### మైలవరం : నువ్వా .... నేనా ?

ఈ స్థానం నుంచి తెదేపా అభ్యర్థిగా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పోటీలో ఉన్నారు. 2009, 2014లో గెలిచిన ఆయన మూడో సారి బరిలో నిలిచారు. నియోజకవర్గంలో చేపట్టిన సీసీ రోడ్లు, ఎత్తిపోతల పథకాలు, గృహాల నిర్మాణాలు, ఇళ్ల స్థలాల పంపిణీ వంటివి గెలిపిస్తాయని విశ్వస్తున్నారు. సీఎం సహాయ నిధి నుంచి పెద్దఎత్తున సాయం అందించేలా చేయగలిగారు. 'దేవినేని ఉమా ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. ఆయన గెలిస్తే మళ్లీ మంత్రి అయ్యి మరింత అభివృద్ధి చేస్తారు' అని గొల్లపూడికి చెందిన చిరు వ్యాపారి నాగేశ్వరరావు తెలిపారు. వైకాపా అభ్యర్థిగా వసంత కృష్ణప్రసాద్ పోటీ ఉన్నారు. ఆర్థికబలం కూడా ఉండటంతో దేవినేనికి గట్టి పోటీ ఇస్తున్నారు.

### జగ్గయ్యపేట : నువ్వా .... నేనా ?

ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సానుభూతి.. ఈ రెండింట్లో జగ్గయ్యపేట వాసులు ఎటు మొగ్గుచూపుతారనేది ఆసక్తికరంగా మారింది. 2009, 2014లో గెలిచిన తెదేపా సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) హ్యాట్రిక్ కొట్టాలన్న ఉద్దేశంలో ఉన్నారు. అయిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఈసారీ విజయం సాధిస్తానని ధీమాగా ఉన్నారు. ఇదే నియోజకవర్గం నుంచి ఐదుసార్లు పోటీచేసి, మూడుసార్లు గెలుపొంది మంత్రిగా పనిచేసిన నెట్టెం రఘురాం నుంచి రాజగోపాల్‌కు మద్దతు లభిస్తుండటం కలిసొచ్చే అంశంగా మారింది. ఇక వైకాపా తరఫున సామినేని ఉదయభాను బరిలో ఉన్నారు. ఈయన 1999, 2004 ఎన్నికల్లో ఇక్కడి నుంచి గెలిచి, 2009(కాంగ్రెస్), 2014(వైకాపా)లో పోటీ చేసి ఓడిపోయారు. తనపై ఉన్న సానుభూతితో గెలుస్తానన్న ధీమాలో ఉన్నారు. 'నేను బస్సులో వెళ్లి పోలవరం ప్రాజెక్టు పనులు చూశాను. రాజధాని ప్రాంతంలో జరుగుతోన్న అభివృద్ధి పనులు గమనించాను.

### గుడివాడ : నువ్వా .... నేనా ?

గుడివాడ నుంచి తెదేపా అభ్యర్థిగా దేవినేని నెహ్రూ తనయుడు దేవినేని అవినాష్ పోటీ చేస్తున్నారు. విజయవాడకు చెందిన వ్యక్తి అయినప్పటికీ స్థానికేతరుడనే ముద్ర పడకుండా గుడివాడలో ఇల్లును కొనుగోలు చేసి.. ఉంటానంటూ ప్రచారంలో పాల్గొంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, వైకాపా అభ్యర్థి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి గట్టి పోటీనిస్తున్నారు. విద్యావంతుడు, ఆర్థికంగా బలవంతుడైన అవినాష్ సీనియర్ నేతలతో కలిసి ప్రచారం సాగిస్తున్నారు. గుడివాడలోని మండపాడు ప్రాంతానికి చెందిన డ్వాక్రా సభ్యురాలు భూపతి నారాయణమ్మ మాట్లాడుతూ 'పసుపు కుంకుమ పథకం కింద డబ్బులు వచ్చాయి. ఈసారి నా ఓటు తెదేపాకే..' అని చెప్పారు. ఇప్పటికే మూడు సార్లు గెలిచిన నాని నాలుగోసారి గెలిచి తన పట్టు నిరూపించుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నారు. ఇక్కడ జనసేన అభ్యర్థి నామపత్రం తిరస్కరణకు గురవ్వడం విశేషం.

### పెనమలూరు : నువ్వా .... నేనా ?

పెనమలూరు నియోజకవర్గంలో తెదేపా అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచి మంత్రిగా పనిచేసిన కె.పార్థసారథి వైకాపా నుంచి పోటీ చేస్తున్నారు. ఇద్దరూ హోరాహోరీగా పోరాడుతున్నారు. ఉయ్యూరు మండలానికి చెందిన అన్నగాని దత్తుడు మాట్లాడుతూ 'తెదేపా పథకాలతో లబ్ధి పొందాం.. మళ్లీ తెదేపానే రావాల్సిన అవసరం ఉంది.' అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, వైకాపా ప్రకటించిన హామీలతో గెలుస్తామన్న ధీమాలో పార్థసారథి ఉన్నారు.

### పామర్రు : నువ్వా.. నేనా..

రిజర్వు స్థానం అయిన పామర్రులోనూ పోరు నువ్వా.. నేనా అన్నట్లు సాగుతోంది. ఇక్కడ రాజకీయ సమీకరణాలు మారాయి. తెదేపా తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన పోటీలో ఉన్నారు. 2014లో వైకాపా నుంచి గెలిచి.. తర్వాత ఆమె సైకిల్ ఎక్కారు. ఇప్పుడు తిరిగి టికెట్ దక్కించుకుని పోటీలో ఉన్నారు. వైకాపా నుంచి అనిల్‌కుమార్ పోటీలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ జనసేనలో చేరి టికెట్ రాలేదని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. ఆ తర్వాత వైకాపాకు మద్దతు ప్రకటించి పోటీ నుంచి వైదొలిగారు.

### మచిలీపట్నం..: నువ్వా .... నేనా ?

మచిలీపట్నం నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. తెదేపా అభ్యర్థిగా కొల్లు రవీంద్ర, వైకాపా అభ్యర్థిగా పేర్నినాని, జనసేన నుంచి బండి రామకృష్ణ పోటీచేస్తున్నారు. గత ఎన్నికల్లో తెదేపా నుంచి గెలిచిన కొల్లు రవీంద్ర మంత్రిగా పనిచేశారు. 2004, 2009 ఎన్నికల్లో గెలిచిన పేర్ని నాని వైకాపా నుంచి బరిలో ఉన్నారు. అయితే బందరు పోర్టు పనులు ప్రారంభం కావడం, శాశ్వత నీటి సమస్య పరిష్కారం, మురుగునీటి సమస్యను తీర్చడం, గృహ నిర్మాణాలు, పింఛన్లు, పసుపు కుంకుమ, పోర్టు పనుల ప్రారంభంతో తనకు కలిసి వస్తుందని కొల్లు రవీంద్ర ధీమాగా ఉన్నారు. పొలాటితిప్ప గ్రామానికి చెందిన రమాదేవి మాట్లాడుతూ 'మా ఊళ్లో చాలా మంది ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందారు. అందుకే తెదేపా వైపే చూస్తున్నాం' అన్నారు. వైకాపా అభ్యర్థి పేర్ని నానికి నియోజకవర్గంపై పట్టు ఉండటం కలిసొచ్చే అంశం మారింది. మరోవైపు హొటల్స్ పరిశ్రమకు చెందిన బండి రామకృష్ణ జనసేన అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. గతంలో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన వేదవ్యాస్‌కు 30వేల ఓట్లు వచ్చాయి.

### విజయవాడ తూర్పు : నువ్వా .... నేనా ?

విజయవాడ తూర్పులో సీనియర్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మరోసారి అద ృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వైకాపా అభ్యర్థిగా బొప్పన భవకుమార్ బరిలో నిలిచారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవికుమార్‌ను సమన్వయకర్తగా నియమించారు. అయితే ఆఖరి నిమిషంలో భవకుమార్‌కు టికెట్ దక్కింది. దీంతో యలమంచిలి సహాయ నిరాకరణ చేశారు. ఆయన గన్నవరంలో ప్రచారం చేస్తున్నారు. ఇది వైకాపాకు ఇబ్బందిగా మారింది. జనసేన నుంచి బత్తిన రాము గట్టి పోటీ ఇస్తున్నారు.

### విజయవాడ పశ్చిమం : నువ్వా .... నేనా ?

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మైనార్టీల ఓట్లు కీలకంగా మారాయి. తెదేపా, వైకాపా, జనసేన అభ్యర్థులతో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. మరోవైపు స్వతంత్ర అభ్యర్థి కొరడా విజయకుమార్ వైకాపా ఓట్లపై ప్రభావాన్ని చూపిస్తారని భావిస్తున్నారు. తెదేపా ఈ సారి టికెట్‌ను ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ కూతురు షబానాకు కేటాయించింది. జలీల్‌ఖాన్ గత ఎన్నికల్లో వైకాపా నుంచి గెలిచి సైకిల్ ఎక్కిన విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో భాజపా నుంచి పోటీ చేసిన వెల్లంపల్లి శ్రీనివాసరావు వైకాపా నుంచి పోటీ చేస్తున్నారు. జనసేన కూటమి తరఫున పోతిన మహేష్ రంగంలో ఉన్నారు.

### గన్న'వరం' : నువ్వా .... నేనా ?

గన్నవరం నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, తెదేపా అభ్యర్థి వల్లభనేని వంశీ మోహన్ మరోసారి బరిలో నిలిచారు. ఈయనకు ఎన్నారై, వైకాపా అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గట్టి పోటీ ఇస్తున్నారు. నిత్యం నియోజకవర్గవాసులకు వంశీ అందుబాటులో ఉంటూ ఏ సాయం కావాలన్నా చేస్తారన్న పేరుంది. రామవరప్పాడు వంతెన పూర్తి, గన్నవరంలో రైతుబజార్, బ్రహ్మయ్య లింగం చెరువు రిజర్వాయరుగా మార్పు, విమానాశ్రయ భూసేకరణ సమస్యల పరిష్కారం వంటి పనులతో విజయంపై వంశీ ధీమాగా ఉన్నారు. ఉంగుటూరు మండలం బొక్కినేల చిన్న మారయ్య మాట్లాడుతూ 'ఏ సమస్య ఉన్నా వంశీకి చెబితే వెంటనే పరిష్కరిస్తుంటారు. పోలవరం నిర్మాణం పూర్తి కావాలంటే మళ్లీ చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. వైకాపా అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఏడాదిన్నర కిందట నియోజకవర్గ ఇంఛార్జిగా నియమించడంతో స్థానికంగా పర్యటిస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు.

### విజయవాడ మధ్య : నువ్వా .... నేనా ?



విజయవాడ మధ్య నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. ఇక్కడ సమీకరణాలు మారడంతో అసమ్మతి గళాలు ఉన్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దాదాపు రూ.1200 కోట్లకుపైగా అభివృద్ధి పనులు జరిగాయని బోండా ఉమా ప్రచారంలో పాల్గొంటున్నారు. వైకాపా నుంచి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బరిలోకి దిగారు. కాంగ్రెస్ నుంచి ఆయన వైకాపాలో చేరడంతో ఇక్కడ టికెట్ ఆశించిన వంగవీటి రాధాకృష్ణ తెదేపాలో చేరారు. మరోవైపు వైకాపా నేత గౌతంరెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విష్ణు ప్రధానంగా తన సామాజిక వర్గ ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. జనసేన బలపరిచిన సీపీఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు కొంత కాలంగా ప్రచారం చేస్తున్నారు.




### నూజివీడు : నువ్వా .... నేనా ?

నూజివీడు నియోజకవర్గంలో తెదేపా అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, వైకాపా అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పోటీ పడుతున్నారు. అప్పారావు ప్రజలకు అందుబాటులో ఉంటారన్న పేరుంది. అప్పారావుకు ప్రధాన అనుచరుల్లో ఒకరైన బసవ భాస్కరరావు సతీమణి రేవతి ప్రస్తుతం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఈమె పదవిలో కొనసాగించే విషయంలో వచ్చిన మనస్పర్థలతో అప్పారావు వర్గం నుంచి బయటకొచ్చి భాస్కరరావు జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈయన ఏ పార్టీ ఓట్లు చీలుస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. తెదేపా తరఫున రెండోసారి వెంకటేశ్వరరావు మళ్లీ ఇక్కడి నుంచే పోటీకి దిగారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు విజయానికి చేరువ చేస్తాయని తెదేపా వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

### కైకలూరు : నువ్వా .... నేనా ?

గత ఎన్నికల్లో మిత్ర పక్షాలకు కేటాయించిన ఈ స్థానం నుంచి ఇప్పుడు తెదేపా పోటీ చేస్తోంది. తెదేపా శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. తెదేపా నుంచి మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ, వైకాపా నుంచి దూలం నాగేశ్వరరావు తలపడుతున్నారు. గత ఎన్నికల్లో తెదేపా మద్దతుతో భాజపా తరఫున కామినేని శ్రీనివాస్ గెలుపొందారు. ఆ సమయంలో తెదేపా శ్రేణులు కొంత అసంతృప్తితో ఉండేవి. ప్రస్తుతం వెంకటరమణకు టికెట్ ఇవ్వడంతో ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. గత ఎన్నికల్లో పెడనకు చెందిన ఉప్పాల రాంప్రసాద్‌కు టికెట్ ఇచ్చిన వైకాపా ఈసారి స్థానికుడు దూలం నాగేశ్వరరావునే బరిలో దించింది. జనసేన చీల్చే ఓట్ల ప్రభావంపై చర్చ జరుగుతోంది.

### పెడన : నువ్వా .... నేనా ?

పెడనలో సామాజిక సమీకరణాలు కీలకంగా మారాయి. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు తనయుడు కాగిత క ృష్ణప్రసాద్ తెదేపా నుంచి పోటీ చేస్తున్నారు. జోగి రమేష్ వైకాపా అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. జనసేన నుంచి లక్ష్మీశ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. ముగ్గురూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఇక్కడ పోరు ఆసక్తికరంగా మారింది. వైకాపాలో అసమ్మతి నెలకొంది. ఆ పార్టీ నుంచి ఉప్పాల రాంప్రసాద్ టికెట్ ఆశించినప్పటికీ.. అనూహ్యంగా జోగి రమేష్‌ను సమన్వయకర్తగా నియమించడంతో రెండు వర్గాలకు మధ్య పొసగడం లేదు.

### అవనిగడ్డ : నువ్వా .... నేనా ?

అవనిగడ్డ నియోజకవర్గంలో త్రిముఖ పోరు నడుస్తోంది. ఇక్కడ తెదేపా అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ రెండుసార్లు కాంగ్రెస్ పక్షాన, మూడోసారి తెదేపా తరఫున పోటీచేసి గెలుపొందారు. రైతుల రుణమాఫీ, పింఛన్లు, పసుపు కుంకుమ పథకాలు, సీసీ రోడ్ల నిర్మాణంపై బుద్ధప్రసాద్ ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. మోపిదేవి మండలానికి చెందిన సీతారామయ్య మాట్లాడుతూ 'సీఎం చంద్రబాబు పేదల అభివృద్ధికి బాగా కష్టపడుతున్నారు. నేను మాత్రం తెలుగుదేశానికి ఓటేస్తా' అన్నారు. గత ఎన్నికల్లో మండలి బుద్ధప్రసాద్‌తో పోటీపడి ఓడిపోయిన సింహాద్రి రమేష్ మరోమారు వైకాపా నుంచి పోటీ పడుతున్నారు. రమేష్ గెలుపునకు సానుభూతి పనిచేస్తుందని భావిస్తున్నారు. జనసేన నుంచి ముత్తంశెట్టి కృష్ణారావు పోటీచేస్తున్నారు.

### తిరువూరు : నువ్వా .... నేనా ?

మంత్రి కెఎస్ జవహర్ సిట్టింగ్ స్థానం కోవూరు(ప.గో.జిల్లా) నుంచి మారి తిరువూరులో పోటీలో దిగారు. ఈయనకు స్థాన మార్పు కలిసి వస్తుందా.. రాదా.. అన్నది తేలాల్సి ఉంది. తెదేపా సంక్షేమ పథకాలు, ఎంపీ కేశినేని నాని ఆధ్వర్యంలో టాటా ట్రస్టు ద్వారా జరుగుతోన్న సేవ కార్యక్రమాలపై జవహర్ ఆశలు పెట్టుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసుకు టికెట్ ఇవ్వకపోవడంతో కొంత అసంతృప్తితో ఉన్నారు. మంత్రితో కలిసి ప్రచారంలోనైతే పాల్గొంటున్నారు. 1994, 1999 గెలిచిన స్వామిదాస్ ఆ తర్వాత వరుసగా మూడు సార్లు ఓడిపోవడంతో అభ్యర్థిని మార్చారు. వైకాపా అభ్యర్థిగా బరిలో ఉన్న రక్షణ నిధి.. తెదేపా అసమ్మతివాదులను కూడగట్టేందుకు ప్రయత్నిస్తూ ముందుకు సాగుతున్నారు.

ఆయుర్వేద చికిత్స కొరకు
సంప్రదించండి - డాక్టర్ విశ్వనాథ్
ఫోన్ : 90329 90138

## పవన్ కల్యాణ్‌కు అలీ ప్రశ్న

# డబ్బిచ్చారా? సినిమాలిప్పించారా?: అలీ

**రాజధాని వార్తలు, అమరావతి :** 'అలీ కష్టాల్లో ఉంటే సాయపడ్డాను అని మీరంటున్నారు..ఏం సాయ చేశారు? డబ్బిచ్చారా? సినిమాలు లేక ఇంట్లో కూర్చుంటే తీసుకెళ్లి సినిమా అవకాశాలు ఇప్పించారా?' అని సినీ నటుడు, వైకాపా నేత అలీ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలో ప్రచారంలో భాగంగా కల్యాణ్ అలీపై వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అలీ స్పందించారు. ఆయన మాట్లాడిన వీడియోలను వైకాపా సోమవారం రాత్రి విడుదల చేసింది.

"పవన్‌కల్యాణ్‌గారు రాజమండ్రిలో మీరు ఒక చిన్న కామెంట్ చేశారు. సర్..! నేను పుట్టి పెరిగింది రాజమండ్రి. నేను పుట్టిన గడ్డకు ఏదైనా చేస్తే బాగుంటుందని నా తండ్రి పేరు మీద ట్రస్ట్ పెట్టి, కులమతాలకు అతీతంగా పేదలకు సేవ చేస్తున్నా. ఆ సమయంలో నా గురించి మాట్లాడాలన్న ఆలోచన మీకు రాకపోయినా, మీ చుట్టు పక్కల ఉన్న వాళ్లు 'అలీ గురించి ఒక కామెంట్ చేయండి. రాజమండ్రి కదా బాగుంటుంది' అని చెప్పి ఉంటారు. మీరు వేరే ఏ జిల్లాలో నా గురించి కామెంట్ చేసినా, నేను స్పందించేవాడిని కాదు. ఎందుకంటే, చిరంజీవిగారు వేసిన బాటలో మీరు వచ్చారు. కానీ, నా బాట నేనే వేసుకున్నా. నా బాటలో నేనే నడిచా, నాకు ఎవరి సపోర్ట్ లేదు. చెన్నై నాకు జీవితాన్ని ప్రసాదించింది. ఎంతో కృషి చేస్తే, నేను ఈ స్థాయిలో ఉన్నా. నా వల్ల ఎవరైనా లాభం పొందారు తప్ప. నేను ఎవరి వద్దా చేయి చాపలేదు. నేను ఎవరినీ ఏమీ అడగలేదు."

"అలీ కష్టాల్లో ఉన్నప్పుడు సాయ పడ్డా' అన్నారు. ఏ విధంగా సాయపడ్డారు? డబ్బిచ్చారా? నాకు సినిమా అవకాశాలు ఇప్పించారా? మీరు ఇండస్ట్రీకి రాకముందే నేను మంచి స్థానంలో ఉన్నా. నేను ఎవరి దగ్గరకు వెళ్లి, 'అయ్యా నాకు సాయం చేయండి' అని అడగలేదు. ఆ అల్లా దయ వల్ల చాలా బాగున్నా. ఒకవేళ అడిగే అవకాశం వస్తే, అప్పటికి అలీ ఉండడు. ఆకలితో చచ్చిపోతాను తప్ప. వెళ్లి అడుక్కోను. ఆ విషయం మీకూ తెలుసు. ఎవరి మనసు నొప్పించేలా.. నేను మాట్లాడను. కానీ, మీరు ఆ మాట అనడం బాధేసింది. వైసీపీలోకి వెళ్లడం తప్పేంటి? రాజకీయ పార్టీలోకి వచ్చాక ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం సాధారణం. నేను ఇప్పటివరకూ చాలా సభల్లో పాల్గొన్నా కానీ, ఎక్కడా మీ గురించి, మీ పార్టీ గురించి ఒక్క కామెంట్ కూడా చేయలేదు. ఎందుకంటే గతంలో చెప్పా.. ఇప్పుడూ చెబుతున్నా. మీకు నా గుండెల్లో స్థానమిచ్చా. కానీ, మీరు చాలా పెద్ద మాట మాట్లాడేశారు."

"మీరు పార్టీ పెట్టినప్పుడు మీరు ఎదగాలని మీ ఆఫీస్‌కు వచ్చి మంచి మనసుతో మీకు ఖురాన్‌ను ఇచ్చాను. మీరు ఎప్పుడూ బాగుండాలని కోరుకునే వ్యక్తుల్లో మొదటి లైనులో ఉండే మొదటి వ్యక్తిని. నా చుట్టానికి టికెట్ ఇచ్చానని మీరు అన్నారు. నేను మిమ్మల్ని వచ్చి అడిగానా? లేదా మీరు నాకు చెప్పి ఇచ్చారా? మీరు ఏ రోజైనా నాకు ఫోన్ చేసి, 'అలీ ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నావు?నేను పార్టీ పెట్టా. నా పార్టీలోకి రా' అని అడిగారా? అడగనప్పుడు ఎందుకు సర్ కామెంట్ చేయడం.. నాకు చాలా బాధగా ఉంది. క్షమించండి.. ధన్యవాదాలు" అంటూ చెప్పుకొచ్చారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI APTEL14598,
Email : rajadhanivartalu1@gmail.com